క్లుప్తంగా

సామాజిక బాధ్యతగా వాహనం అందజేత



ఎస్పీ శివకిషోర్‌కు వాహనం అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటరాజు

ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల పోలీస్‌స్టేషన్‌కు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు వాహనాన్ని అందజేయటం అభినందనీయమని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం వద్ద ఎస్పీకి ఆ వాహనాన్ని అందజేశారు. సామాజిక బాధ్యతగా పోలీస్ వ్యవస్థ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో రూ.12 లక్షల ఎమ్మెల్యే నిధులతో వాహనాన్ని అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, సీఐ యూజే విల్సన్, ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, ఎస్సై సుధీర్, హెడ్ కానిస్టేబుల్ ఎస్ రమేష్‌కుమార్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమాజంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి విద్యార్థులు భాగస్వాములు కావాలని యూత్‌ఫర్ సోషల్ ఇంఫాక్ట్ (వైఎఫ్ఎస్ఐ) కోఆర్డినేటర్ వి.వెంకట్రావు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మధ్యాహ్నం యూత్ ఫర్ సోషల్ ఇంఫాక్ట్ (వైఎఫ్ఎస్ఐ) అనే కార్యక్రమంపై విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కళాశాల విద్యా కమిషన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో దాగిన సృజనాత్మక శక్తులను వెలికి తీయడానికి అవకాశం ఉందన్నారు. వైఎఫ్ఎస్ఐ కోఆర్డినేటర్ ఎస్ పరమేశ్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. వైస్ ప్రిన్సిపాల్ కె.అజయ్ కుమార్, సీపీడీసీ సభ్యులు ఎల్ వెంకటేశ్వరరావు, ఎం రాంబాబు, టీపీఎస్ పద్మావతి, పి.విజయ కుమార్, ఎం కృష్ణ చైతన్య, టి.వెంకట దుర్గాప్రసాద్, పీఆర్ కావ్య శ్రీ, ఎస్ సుస్వలత, డి.సుజాత, జె.మధు సూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడు, ప్రతికోళ్లలంక, గుడివాకలంక, మొండికోడు, మాధవాపురం, కోటేశ్వరదుర్గాపురం, చాటపర్రు గ్రామాల్లోని పాఠశాలల్లో శుక్రవారం యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు, యూనియన్ నాయకులతో కలిసి సభ్యత్వ నమోదు చేశారు.

ఫుట్‌పాత్‌లపై ప్రమాద ఘంటికలు

- విరిగిన సిమెంట్ దిమ్మెలు
- ధ్వంసమైన రెయిలింగ్‌లు
- పొంచి ఉన్న ప్రమాదం
- రాకపోకలకు ప్రజల ఇబ్బందులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలోని ఓవర్ బ్రిడ్జిలు, వంతెనలపై ఇరువైపులా ఏర్పాటు చేసిన ఫుట్ పాత్‌లు ఛిద్రమయ్యాయి. నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ఓవర్ బ్రిడ్జిలు, వంతెనలపై నుంచి పాదచారులు, సైకిలిస్టులు రాకపోకలు సాగించేందుకు వీలుగా ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేశారు. ఈ ఫుట్ పాత్‌ల నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవి పాడైపోయి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. పగలు ఎలా ఉన్నా చీకటి వేళల్లో రాకపోకలు సాగించే వారు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. తక్షణం పాడైపోయిన ఫుట్ పాత్‌లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే

ఫైర్ స్టేషన్ సెంటర్‌లోని ఓవర్ బ్రిడ్జి, జూట్ మిల్లు సెంటర్‌లోని వంతెన, వసంత మహల్ సెంటర్‌లోని వంతెన, కత్రల వంతెన, పాత బస్టాండ్ వద్ద ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి, వన్‌టౌన్, టూటౌన్‌లను కలిపే పెద్ద వంతెన, రైల్వే స్టేషన్ నుంచి మార్కెట్ యార్డుకు వెళ్లే మార్గంలోని తమ్మిలేరుపై ఉన్న వంతెన, తంగెళ్ల మూడి వంతెన, అశోక్ నగర్ వంతెన ఇలా పలు ఓవర్‌బ్రిడ్జిలు, వంతెనలు ఉన్నాయి. వీటన్నింటికీ ఇరువైపులా ఫుట్‌పాత్‌లను నిర్మించారు. ఇవి పలు చోట్ల ధ్వంసం అవ్వడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

పూల కుండీల ఏర్పాటుపైనే శ్రద్ధ

ఓవర్ బ్రిడ్జిలపై ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఈడా) ఆధ్వర్యంలో సిమెంట్ పూల కుండీలను ఫుట్ పాత్‌లపైనే పెట్టారు. వాటి పక్క నుంచి ప్రజలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఈ కుండీలపై ఉన్న శ్రద్ధ ప్రజలకు ఉపయోగకరంగా ఉండే ఫుట్ పాత్‌ల మరమ్మతులపై లేకపోవడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు.

రెయిలింగ్‌లు ధ్వంసం

ఓవర్ బ్రిడ్జిలు, వంతెనలపై ఇరువైపులా నిర్మించిన రెయిలింగ్‌లు సైతం చాలా చోట్ల ధ్వంసమయ్యాయి. అయినా నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగించే అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగాక ముందే రక్షణ చర్యలు చేపట్టాలని, ఫుట్ పాత్‌లు, రెయిలింగ్‌లను పునర్నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



పాత బస్టాండ్ వద్ద ఉన్న ఫ్లైఓవర్‌పై ధ్వంసమైన ఫుట్ పాత్



వన్ టౌన్, టూటౌన్‌లను కలిపే పెద్ద వంతెనపై పూర్తిగా కుంగిపోయిన ఫుట్ పాత్



ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి జూట్ మిల్లు సెంటర్‌కు వెళ్లే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ధ్వంసమైన రెయిలింగ్

ఫుట్‌పాత్‌లను బాగు చేయాలి



నగరంలోని ఫ్లై ఓవర్‌లు, వంతెనలపై ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లు చాలా చోట్ల పాడైపోయాయి. పాదచారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రాకపోకలకు నిత్యం అవస్థలు పడుతున్నారు. అధికారులు తక్షణం పాడైపోయిన ఫుట్ పాత్‌లకు మరమ్మతులు చేయించాలి. ప్రజల అసౌకర్యాన్ని తొలగించాలి.

– జి.గోపి, సీఐటీయూ నాయకులు, ఏలూరు

రెయిలింగ్‌లను పునర్నిర్మించాలి



వంతెనలు, ఓవర్ బ్రిడ్జిలపై పాడైపోయిన రెయిలింగ్‌లను పునర్నిర్మించాలి. పలు సందర్భాల్లో వాహనదారులు, పాదచారులు రెయిలింగ్ పాడైన కారణంగా ప్రమాదాలకు గురవుతున్నారు. చిన్నచిన్న పనుల పట్ల పాలకులు శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది. పాడైపోయిన ఫుట్ పాత్‌లను సరిచేయాలి. ప్రజల అవస్థలను తొలగించాలి.

– పి.ఆదిశేషు, చేతివృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్, ఏలూరు

పింగళిని విస్మరిస్తున్న భారత జాతి



పింగళి వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారత జాతి యావత్తు తలెత్తి గౌరవించే జాతీయ పతాకాన్ని రూపొందించిన తెలుగు తేజం పింగళి వెంకయ్యను భారత జాతి విస్మరిస్తోందని జాతీయ జండా ప్రచారకర్త, ఘంటసాల స్వరపీఠం వ్యవస్థాపకుడు ఎస్ఎం సుభానీ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక న్యూ అశోక్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో పింగళి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభానీ మాట్లాడుతూ వెంకయ్య తెలుగు గడ్డపై పుట్టడమే ఆయన చేసుకున్న దురదృష్టమన్నారు. వెంకయ్య రూపొందించిన పతాకానికి దేశ వ్యాప్తంగా లభిస్తున్న గౌరవం కూడా ఆయనకు దక్కడంలేదని వాపోయారు. ఇప్పటికైనా వెంకయ్యకు దేశ, తెలుగు ప్రజలు సముచిత గౌరవం ఇచ్చి ఆయనను స్మరించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం వచ్చే స్వాతంత్య్ర దినోత్సవానికి జాతీయ జెండాలు పంపిణీ చేసే నిమిత్తం జెండాలు కుట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవరకొండ వెంకటేశ్వర్లు, మేడికొండ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల సమస్యపై త్రిసభ్య కమిటీ

సాక్షి స్పందన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని ఉర్దూ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై అధికారుల నిర్ణయం – విద్యార్థులకు సంకటం అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురించిన కథనానికి జిల్లా విద్యాశాఖాధికారి స్పందించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ (మాకా) ఉర్దూ పాఠశాలకు ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల పదోన్నతుల్లో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను కేటాయించామని, అదే పాఠశాలలో గత ఎనిమిదేళ్లుగా పని చేస్తున్న ఉపాధ్యాయులను తూర్పువీధి పాఠశాలకు బదిలీ చేశామని తెలుపుతూ కలెక్టర్‌కు సమర్పించిన నివేదికలో తెలిపారు. తూర్పువీధి పాఠశాల సెలవుల అనంతరం తెరిచిన తరువాత సమస్య తమ దృష్టికి వచ్చిందన్నారు. కాగా సాక్షి దినపత్రికలో వచ్చిన కథనంపై విచారణ చేసి నివేదిక సమర్పించాలని త్రిసభ్య కమిటీ వేశామని, ఆ కమిటీ ప్రతినిధులు సదరు పాఠశాలకు విచారణ నిమిత్తం వెళ్లిన సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు వారిని చుట్టుముట్టి ఆందోళన చేశారని కమిటీ సభ్యులు నివేదిక సమర్పించలేదని కలెక్టర్‌కు తెలిపారు. ఆ కమిటీ నివేదిక వచ్చిన తరువాతపై అధికారులకు సమర్పించి తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌కు సమర్పించిన నివేదికలో తెలిపారు.

ఏడీకి తల్లిదండ్రుల వినతి

ఇదిలా ఉండగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం మధ్యాహ్నం ఆ పాఠశాల సమీపంలోని నాలుగు మసీదుల్లో మైకుల్లో ప్రకటించుకుని తమ సమస్యను పరిష్కరించడానికి సహకరించాలని ప్రధానోపాధ్యాయురాలికి వినతిపత్రం అందజేయాలని నిర్ణయించుకున్నారు. మధ్యాహ్నం నమాజు పూర్తయిన తరువాత తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకున్నారు. ఆ సమయంలో పాఠశాలకు విచారణ నిమిత్తం అక్కడికి వచ్చిన విద్యాశాఖ ఏడీకి వారు వినతిపత్రం అందజేశారు.

అనుమానంతో కేసులు

విద్యార్థుల భవిష్యత్ కోసం వారి తల్లిదండ్రులు పోరాడుతుంటే వారికి సహకరిస్తున్నారనే అనుమానంతో ఆ పాఠశాల టీచర్లు వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఒక ప్రజా ప్రతినిధి కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకే వారు పోలీసులకు ఫిర్యాదు చేశారని స్థానిక ముస్లిం వర్గాల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమౌతున్నాయి. సదరు ప్రజా ప్రతినిధి సిఫార్సు మేరకే ఈ పాఠశాలకు పదోన్నతిపై కేసులు పెట్టిన టీచర్లు వచ్చారని స్థానిక ముస్లింలు చెబుతున్నారు. ముస్లింలపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిన్న చూపును ఆ ప్రజా ప్రతినిధి మరోసారి నిరూపించుకున్నారని ముస్లింలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకం

నివాళులర్పించిన కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత కలెక్టరేట్ ప్రాంగణంలోని అల్లూరి విగ్రహానికి కలెక్టర్ కె.వెట్రిసెల్వి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జీవితాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని, ఉద్యోగులు ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. స్వాతంత్య్ర సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి ధైర్యం, త్యాగనిరతి, నిరాడంబరత తరతరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి ఎస్ఎస్ కృపావరం, కలెక్టరేట్ పరిపాలనాధికారి నాంచారయ్య, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి విగ్రహావిష్కరణ

ఏలూరు (టూటౌన్): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం ప్రాంగణంలో మార్నింగ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అల్లూరి విగ్రహాన్ని ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య (చంటి) శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా స్కూల్ పిల్లలకు బుక్స్ అందజేశారు. వాకర్స్ సభ్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వాకర్స్ అధ్యక్షుడు పత్తిపాటి నాగ విఘ్నేశ్వర రావు, గౌరవ అధ్యక్షులు ఎస్ఎం అక్బర్, మహిళ వాకర్స్ అధ్యక్షురాలు మేరీ మాణిక్యం, సోషల్ వర్కర్ గొంతిన రామకష్ణ, వాకర్స్, మహిళా వాకర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లూరి, అల్లూరులకు ఘన నివాళి

మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి, సీపీఎం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాజీ కార్యదర్శి, కమ్యూనిస్టు పార్టీ నిర్మాత కామ్రేడ్ అల్లూరు సత్యనారాయణ వర్ధంతి కార్యక్రమాలను పవర్ పేటలోని సీపీఎం ఏలూరు జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డీఎన్‌వీడీ ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి సీపీఎం నేత గుడిపాటి నరసింహారావు, సత్యనారాయణ చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు పి.ఆదిశేషు, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి సేవలను గుర్తుచేసుకున్నారు. వీవీఎన్ ప్రసాద్, కోటేశ్వరరావు, త్రినాథ్, ఎం సత్యం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో..

పార్టీ అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ ఆధ్వర్యంలో అల్లూరి 128వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నెక్కంటి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో నాయకులు కట్నేని కృష్ణ ప్రసాద్, నడవన దాన భాస్కర్, గాది రాంబాబు, గుమ్మడి చైతన్య, బాడిత నారాయణరావు, అదపాక నాగ సురేష్, కుసుమ కుమారి తదితరులు పాల్గొన్నారు.

నేటి యువతకు స్ఫూర్తి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్వాతంత్య్రం కోసం అల్లూరి సీతారామ రాజు చేసిన పోరాటాలు నేటి యువతకు స్ఫూర్తి అని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేద్కర్ అన్నారు. స్థానిక విద్యుత్ భవన్‌లో అల్లూరి జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. తొలుత అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఓ ఫైనాన్స్ టి.శ్రీదేవి, ఏడీఈలు ఎ.రమాదేవి, పి.నాగేశ్వరరావు, నాయకులు తురగా రామకృష్ణ, ఆర్ భీమేశ్వరరావు, ఎ.శ్రీనివాస్, తారా సింగ్, అబ్బాస్, పి.శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.



అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి



ఏలూరు (టూటౌన్) : ఏఎస్ఆర్ స్టేడియంలో ఆవిష్కరించిన సీతారామరాజు విగ్రహం

హోంగార్డుకు డీఎస్పీ వితరణ



హోంగార్డుకు ఆర్థిక సాయం అందిస్తున్న డీఎస్పీ

ఏలూరు టౌన్: డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఏలూరు హోం గార్డు యూనిట్‌లో పనిచేస్తోన్న మహిళ హోం గార్డు పద్మ భర్త క్యాన్సర్‌తో బాధపడుతూ ఉన్నాడు. ఆయనకు వైద్య చికిత్సల నిమిత్తం భారీగా సొమ్ము అవసరం అవడంతో డీఎస్పీ తన వంతుగా రూ.10 వేలు సాయం చేశారు. ఆమె భర్త త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పవర్‌పేట ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. పవర్‌పేట, చిట్టివలస పాకలు, వసంత మహల్, కత్రల వంతెన పాత బస్టాండు, గూడ్స్‌షెడ్‌రోడ్డు, పాండురంగ పురం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా

జంగారెడ్డిగూడెం: సమస్యల పరిష్కారం కోరుతూ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ స్థానిక డిపో వద్ద శుక్రవారం ధర్నా చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రీజినల్ జాయింట్ సెక్రెటరీ బీవీఎస్ఎస్ రంగనాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు ప్రమోషన్ కల్పించాలని, 11వ పీఆర్సీ 24 నెలల ఏరియర్‌లు చెల్లించాలని, ఉద్యోగ భద్రతకు ఎంప్లాయీస్ యూనియన్ ఏర్పాటుచేసి సర్క్యులర్ 1/2019 అమలుకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ బస్సులు లీజుకు ఇచ్చే పద్ధతి మానుకోవాలని కోరారు. సీసీఎస్ ఆఫీస్‌ను ఎండీ ఆఫీస్ వద్దే కొనసాగాలని, రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాడ్యుటీ, టెర్మినల్ ఎన్ క్యాష్‌మెంట్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాలం చెల్లిన బస్సులు స్థానంలో కొత్తవి ప్రవేశపెట్టాలని కోరారు.

సార్వత్రిక సమ్మెలో పాల్గొనండి

ఏలూరు (టూటౌన్): కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని చేతి వృత్తిదారులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఏలూరు జిల్లా కమిటీ కార్మిక వర్గానికి పిలుపునిచ్చింది. శుక్రవారం స్థానిక ఆర్ఆర్ పేటలోని వృత్తి సంఘాల జిల్లా కార్యాలయంలో గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం జిల్లా నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు ఇటీవల నిర్వహించిన కార్యక్రమాల వివరాలు తెలిపారు.

కరపత్రం విడుదల

హమాలీ కార్మికులకు ఉపాధి భద్రతతో కూడిన చట్టం చేయాలి, ఆ నినాదంతో ఈ నెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక మెయిన్ బజార్ సెంటర్లో ఐఎఫ్‌టీయూ అనుబంధ జట్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇఫ్టూ రాష్ట్ర కమిటీ ముద్రించిన కరపత్రం శుక్రవారం విడుదల చేశారు. ఐఎఫ్‌టీయూ ఏలూరు నగర సహాయ కార్యదర్శి గడసాల రాంబాబు, జట్టు కార్మిక సంఘం కోశాధికారి ముంగం అప్పారావు మాట్లాడారు. గునుపూడి నాగేశ్వరరావు, మట్ట ఈశ్వరరావు, తిరుపతిరావు, సంధకం అప్పారావు, కొవ్వాడ సురేష్, రాయి అప్పారావు పాల్గొన్నారు.

మోసపూరిత హామీలపై నిలదీద్దాం

కామవరపుకోట: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీపై శనివారం చింతలపూడి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు తెలిపారు. శుక్రవారం సభా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలతో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ నాయకుల మోసపూరిత హామీలను ఎండగట్టేందుకు ప్రతి ఒక్కరూ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సభకు ముఖ్య అతిథులుగా ఉభయ గోదావరి జిల్లాల కో ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ పరిశీలకులు వంకా రవీంద్రనాథ్, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, ఏలూరు పార్లమెంట్ కోఆర్డినేటర్ కారుమూరి సునీల్ కుమార్, మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకులు జెట్టి గురునాథరావు, పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ నియ మితులైన రాయంకుల సత్యనారాయణను మండల వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు.

ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

కుక్కునూరు: ఖాళీగా ఉపాధ్యాయులు పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ ఏలూరు జిల్లా కార్యదర్శి కొలికపోగు లెనిన్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో కోఆర్డినేటర్ పోతురాజుకి వినతిపత్రం అందజేశారు. లెనిన్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సరిపడ ఉన్నా ఉపాధ్యాయులు లేరని తెలిపారు. కుక్కునూరు మండల వ్యాప్తంగా 32 ఎంపీపీఎస్, 11 ఎంపీయూపీఎస్, 3 జెడ్పీపీహెచ్ఎస్ పాఠశాలలు ఉన్నాయని, మూడు వేలకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా పూర్వ సహాయ కార్యదర్శి యర్నం సాయి కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే కౌన్సెలింగ్ చేపట్టి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	38	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	66
వంకాయలు (కాంతులు)	34	బీక్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	40	చామదుంపలు	36
బెండకాయలు	36	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	40	కంద	--
కాకర కాయలు	40-48	బీట్‌రూట్	38
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	96
క్యాబేజీ	26	అల్లం	60
క్యారెట్	45	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	40	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
అనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	86
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	31
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	19
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో 22సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	26
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	26
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	26
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు - తిరుపతి	16.00	4830	34